క్లుప్తంగా

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే


పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్ర నూతన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో మంగళవారం ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కోదండరెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. ఆయన వెంట డీసీసీ ప్రధా నకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

పటాన్‌చెరు: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్ కుమార్ గౌడ్‌ని హైదరాబాద్ లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ శ్రేణులతో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన సెట్విన్ చైర్మన్

జహీరాబాద్: పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయన స్వగృహంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు దక్కుతాయనడానికి మహేష్ కుమార్‌గౌడ్ నిదర్శనమన్నారు.

ఇద్దరు అదృశ్యం

కల్హేర్(నారాయణఖేడ్): యువకుడు అదృశ్యమైన ఘటన సిర్గాపూర్ మండలంలో చోటు చేసుకుంది. సిర్గాపూర్ ఎస్‌ఐ డి.వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న ముబారక్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రాజు (38) సోమవారం రాత్రి నిద్ర లేచి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మేస్త్రి పనికి వెళ్లొస్తానని..

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ ఉసికే బావికి చెందిన అద్దాల జయరాజ్(25) మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 8వ తేదీన ఇంటి నుంచి పనికి వెళ్లి తిరిగి రాలేదు. స్థానికంగా, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య అద్దాల లలిత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు జహీరాబాద్‌కు డీకే అరుణ రాక

జహీరాబాద్: జాయింట్ పార్లమెంట్ కమిటీ సభ్యురాలు, ఎంపీ డీకే అరుణ బుధవారం జహీరాబాద్‌కు వస్తున్నట్లు రైతు హక్కుల సాధన సమితి కన్వీనర్ పి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను వక్ఫ్‌కింద చేర్చడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు తెలుసుకునేందుకు గాను ఆమె హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటకు జహీరాబాద్‌లోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో రైతులతో సమావేశం అవుతారని, ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో తెలుసుకుంటారన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గంలోని భూ బాధితులు సమావేశానికి హాజరై తమ సమస్యలను విన్నవించాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


మిర్జాపూర్(బి)లో మృతి చెందిన గేదెలు

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుత్ తీగ తెగి పడి రెండు గేదెలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మిర్జాపూర్(బి)లో మంగళవారం చోటు చేసుకొంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇస్మాయిల్ ఎప్పటిలాగే తన రెండు గేదెలను ఇంటి ఆవరణలో కట్టేశాడు. మంగళవారం ఇంటి సమీపంలో గల విద్యుత్ స్తంభం ఎల్‌టీ తీగ తెగి గేదెలపై పడింది. దీంతో గేదెలు మృతిచెందాయి. గేదెల మృతితో రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఇదిలా ఉండగా విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ అర్జున్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు.

నేటి తరానికి ఐలమ్మ స్ఫూర్తి


నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


సంగారెడ్డి ఎడ్యుకేషన్ : ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


ఝరాసంగంలో ఐలమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేటి తరానికి వీర నారి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తి అని వక్తలు అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కనబరిచిన తెగువ ప్రస్తుత సమాజానికి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన వీర వనిత అని కొనియాడారు. సబ్బండ వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

– నెట్‌వర్క్


పటాన్‌చెరు: చాకలి ఐలమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


న్యాల్‌కల్(జహీరాబాద్): హద్నూర్‌లో నివాళులర్పిస్తున్న సీఐ, రజక సంఘం నాయకులు


పటాన్‌చెరు టౌన్ : చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్


రామచంద్రాపురం(పటాన్‌చెరు): నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేశ్


కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టిలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు


పుల్‌కల్(అందోల్) : ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: పట్టణంలోని రాజీవ్‌చౌక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బాగా పాడైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని మంగళవారం బహుజన ఉద్యమకారులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడైన న్యాయవాది అలిగే జీవన్ కుమార్ మాట్లాడుతూ.. పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

మమ్మల్ని ఆదుకోండి సార్


మునిపల్లి(అందోల్): పంటను చూపిస్తున్న రైతు

మునిపల్లి(అందోల్): దెబ్బతిన పంటలకు పంట నష్టపరిహారం మంజూరు చేయాలని ఆయా గ్రామాల రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. మంగళవారం మండలంలోని తాటిపల్లి, కంకోల్, మగ్దుంపల్లి, మల్లిఖార్జునపల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల రైతులు పరిహారం మంజూరు చేయాలని సంబంధిత అధికారులను వేడుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని పత్తి పంట కొంత నీటి ఉధృతికి కొట్టుకోపోగా పత్తి పంట కాయలు మసకబారి పనికి రాకుండా పోయాయన్నారు. అధికారులు స్పందించి పత్తి పంట నష్టపరిహారం మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

రాయికోడ్(అందోల్): మండలంలోని వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి సారిక అన్నారు. కొన్ని రోజులుగా ఏఈఓలతో కలిసి దెబ్బతిన్న పంటలు, సాగు వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 30 గ్రామాల్లో పంటల పరిశీలన పూర్తయిందని రెండు రోజుల్లో దెబ్బతిన్న పంటల వివరాలను, జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని వివరించారు.

ఎండోమెంట్ బిల్లును ఉపసంహరించండి


ఆర్డీఓ కార్యాలయ అధికారి సుభాష్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సభ్యులు

జహీరాబాద్ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండోమెంట్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ముస్లిం యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ముస్లిం యాక్షన్ కమిటీ అధ్యక్షులు యూనూస్ మాట్లాడుతూ దేశ లౌకిక సంప్రదాయాలు చెక్కుచెదరకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మొహిజోద్దీన్, సమీయోద్దీన్, ఫారూక్, మాజీద్, అక్బర్, అబ్దుల్ సత్తార్, ఎజాజ్ పాష పాల్గొన్నారు.


గణేష్ మండపం వద్ద శ్రీ సాయిమాణిక్ నగర్ అసోసియేషన్ సంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహిస్తున్న కుంకుమార్చన కార్యక్రమం

గణపతి పప్పా మోరియా..

జిల్లావ్యాప్తంగా మండపాల్లో వెలసిన గణపతి విగ్రహాలకు భక్తులు వైభవంగా పూజలు చేస్తున్నారు. రకరకాల నైవేద్యాలు సమర్పించి విఘ్నాలు తొలగించు దేవా అని వేడుకుంటున్నారు. పూజా కార్యక్రమాల్లో ప్రముఖులు పాల్గొంటున్నారు.


న్యాల్‌కల్ : హనుమాన్ ఆలయంలో పూజలందుకుంటున్న వినాయకుడు


సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వెంకటాపూర్ విఘ్నేశ్వర యూత్ సభ్యుల ఆధ్వర్యంలో..


సంగారెడ్డి అర్బన్: గీతానగర్ కాలనీలో గణనాథునికి పూజలు నిర్వహించిన భక్తులు


పటాన్‌చెరు : అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి


కంగ్టి (నారాయణఖేడ్): ఏకదంతుడికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా మల్లికార్జున స్వామి ఉత్సవాలు


స్వామిని దర్శించుకుంటున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం ధనసిరిలో మల్లికార్జున స్వామి పల్లకి సేవా ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు సప్త భజన, స్వామి వారి పల్లకీ సేవా ఊరేగింపు, కోలాటాలు, భజనలు కొనసాగుతాయి. ఉత్సవాల్లో పాల్గొనేందుకు కర్నాటక రాష్ట్రం నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. బీజేపీ నాయకులు, కవి డాక్టర్ పెద్ద గొల్ల నారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

తీరిన రోడ్డు కష్టాలు


అల్లాన రోడ్డుకు చేపడుతున్న మరమ్మతులు

జహీరాబాద్ టౌన్: దెబ్బతిన్న అల్లాన రోడ్డుకు ఆర్ అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. భారీ వర్షాలతో బైపాస్ రోడ్డు నుంచి అల్లాన వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇదే దారిలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. వానొస్తే ఈదారి అంతా మడుగులను తలపిస్తుంది. ఈ రోడ్డు నుంచి రాకపోకలు సైతం నిలిచిపోయాయి. దీంతో ఆర్అండ్‌బీ ఆధికారులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. ఆగస్టు 3న సాక్షి దిన పత్రికలో 'వానొస్తే నరకమే..' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. రోడ్డు మరమ్మతుల పనులను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి


పోస్టాఫీసును ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ మురళి కుమార్ అన్నారు. మంగళవారం కంభాలపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచ్ పోస్టాఫీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోస్టాఫీసుల్లో సేవింగ్ అకౌంట్, ఇన్సూరెన్స్ పాలసీ వలన కలిగే లాభాలతో పాటు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుకన్య సమృద్ధి ఖాతాల గురించి వివరించారు. కార్యక్రమంలో రీజినల్ ఇన్‌స్పెక్టర్ సావిత్రి, ఐబీఎం వెంకటేశ్వర్లు, బీపీఎం అశోక్, రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీహరి పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి


క్రీడాకారులతో ఎంఈఓ, ఎంపీడీఓ

కొండాపూర్(సంగారెడ్డి): ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎంఈఓ భీంసింగ్, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ ఖైరత్ అలీ, లాలు, గోకుల్ కృష్ణ, రాజు, కిష్టయ్య, జయంతి, పాల్గొన్నారు.

రికార్డులు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని పాటి, కర్ధనూరు, ఘనాపూర్, ముత్తంగి, పోచారం గ్రామాలు తెల్లాపూర్ మున్సిపాలిటీలో అదే విధంగా అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్ గూడ, కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్, దాయర గ్రామాలు అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోకి విలీనమయ్యాయి. ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు గ్రామ పంచాయతీ అధికారులతో సమావేశమై రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు విలీనమైన గ్రామ పంచాయతీల్లో పూర్తి స్థాయిలో మున్సిపల్ పరిపాలన ప్రారంభమవుతుందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బస్టాండ్‌లో దుర్గంధం నివారించండి

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు దట్టంగా పెరిగి, పందులు, శునకాలు సంచరిస్తున్నాయని తెలిపారు. మూత్ర విసర్జనలతో ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. బస్టాండ్ ఎదుట వ్యాపారాల కోసం స్థలాన్ని అద్దెకు ఇచ్చి అద్దెపై చూపుతున్న ఆసక్తి పారిశుద్ధ్యంపై చూపడంలేదని విమర్శించారు.

◆ ఆధ్యాత్మికచింతన అందరూ అలవర్చుకోండి

నారాయణఖేడ్: ఆధ్యాత్మిక చింతనను ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని బండరేంజల్‌కు చెందిన ఆధ్యాత్మికవేత్త హన్మాండ్లు మహారాజ్ అన్నారు. ఖేడ్ మండలంలోని సంజీవన్‌రావుపేటలో అనంతశయన గణేశ్ మండలి ఆధ్వర్యంలో గణేశ్ మంటపంలో ఏర్పాటు చేసిన సప్తాహాలో భాగంగా మంగళవారం అఖండ హరినామ సప్తాహాలో భాగంగా కీర్తన సేవ నిర్వహించారు. గణేశ్ ఉత్సవాల్లో సప్తాహా నిర్వహించడంపై నిర్వాహకులను ఆయన అభినందించగా భక్తులు ఆయనను శాలువాలతో సన్మానించారు. గ్రామపెద్దలు విఠల్, నర్సింలు, సాయిరెడ్డి, సంజీవరెడ్డి, అర్చకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమాన

పటాన్‌చెరు టౌన్ : డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం మేరకు.. ఆదివారం, సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

◆ ముళ్లపొదలు తొలగించేందుకు చర్యలు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ కాముని చెరువు కట్టపై ముళ్లపొదలు తొలగించేందుకు అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువు కట్టపై ఇబ్బందులు తప్పవని గ్రామ కాంగ్రెస్ నాయకులు వీర్‌షెట్టి, తదితరులు ఎమ్మెల్యే సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను తీర్చాలని ఎమ్మెల్యే నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. డీఈఈ పవన్‌కుమార్, ఏఈ సూర్యకాంత్ చెరువు కట్టను పరిశీలించారు. ముళ్లపొదలు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు బాలయ్య, సాయిలు, గంగారం గ్రామస్తులు రఘువీర్ పాల్గొన్నారు.

◆ అవార్డు ప్రదానం

జహీరాబాద్: మండల పరిధి అల్గోల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న వినయపాటిల్‌కు రెడ్ క్రాస్ సొసైటీ ఉత్తమ సేవకురాలి అవార్డు అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని నారాయణగూడలో గల ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యారంగానికి అందిస్తున్న సేవలకు గాను ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందజేశారు.

◆ నియామకం

సంగారెడ్డి టౌన్ : సమైక్య హ్యూమన్ రైట్స్ సంగారెడ్డి నియోజకవర్గ చైర్మన్‌గా రవివర్మ నియమితులయ్యారు. మంగళవారం చైర్మన్ సాయికుమార్ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు.

◆ ఆత్మహత్యలు అంతిమ పరిష్కారం కాదు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : యువత ఒత్తిడికి లోనై క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దని తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్, జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆత్మహత్యల నిరోధ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.జగదీశ్వర్, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ మల్లిక, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయకుమార్, డాక్టర్ సుమతి దేవి, సీనియర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.


◆ నాణ్యమైన విద్యను అందించాలి

సంగారెడ్డి టౌన్ : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీడీవో యాదగిరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలోని భవనాల మరమ్మతు పనులను పరిశీలించారు.

◆ గీతంలో ఫార్మసీ విద్యార్థులకు పోటీలు

పటాన్‌చెరు: ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఈనెల 25న ఫార్మసీ విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ ప్రదర్శన, మౌఖిక ప్రదర్శన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముగ్గురు లేదా నలుగురు జట్టుగా గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ప్రత్యక్షంగా నిర్వహించే క్విజ్ పోటీలలో పాల్గొనాలని చెప్పారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థి సమన్వయకర్తలను 73307 78199, 89777 14744 సంప్రదించాలని సూచించారు.

గులాబీ వర్ణంలో గణనాథుడు



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గణేశ్ గడ్డ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణేష్ గడ్డ దేవస్థానంలో గణనాథుడిని గులాబీ వర్ణంలో అర్చకులు అలంకరించి, పూజలు, హోమం నిర్వహించారు. నిత్య అన్నదానం కొనసాగుతున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో శశిధర్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్లు తెలిపారు.

కంపు.. కంపు..


అపరిశుభ్రంగా ఉన్న మార్కెట్ యార్డు

సంగారెడ్డి జోన్: అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ, పట్టింపు లేని తనంతో మార్కెట్ యార్డ్ కంపు కొడుతోంది. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో కుళ్లిన కూరగాయలు, వర్షపు నీరు నిలిచిపోయింది. గ్రామాలలో నిర్వహించే సంతలకు కూరగాయలు ఇక్కడి నుంచి తరలి వెళ్తుంటాయి. అసలే వారం రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. కూరగాయలు సైతం ఎక్కడిపడితే పారేయడంతో కుళ్ళిపోయి దుర్వాసన వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని మార్కెట్ యార్డు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు.